# తెర తీయగ రాదా

**-కె. కుమారి**

నేను ఆమెను మర్చిపోలేకపోతున్నాను. కన్నీళ్ళతో నిండిన కళ్ళతో ఆమె ముఖం ఎప్పటికీ నా మనసులో మెదులుతూనే వుంది. ఆమె యిప్పుడు ఎలా జీవిస్తోందో? అసలు బతికి వుందా? ఆ ఆలోచన రాగానే నా శరీరం వణికింది.

*

అవి నేను పదవ తరగతి పరీక్షలు రాసిన తర్వాత వేసవి శెలవులు. నేను మా తాతయ్య ఊరు వెళ్ళాను.

చుట్టూ వున్న కొండలు కోటలాగా ఓ వింత అందాన్ని ప్రతిబింబించే చిన్న పల్లె అది. ఆ ఊరికి మధ్యలో ఒక పెద్ద కోనేరు. అతిథులకై వేసిన విస్తర్లలా ఉన్నాయి కోనేరు నిండా తామరాకులు. "మేమే వడ్డించేవాళ్ళం" అన్నట్లు అక్కడక్కడా విసిరేసినట్లున్నాయి తామర పువ్వులు. ఆ ఊరికి ఒకటే వడ్డించిన విస్తరి అయితే పల్లె వాళ్ళందరూ తలా పిడికెడు మెతుకులు తీసుకొనేవాళ్ళేమో! కానీ ఒకటే

ఆదర్శాలు పల్లించకుండా, తాము వాటిని అనుసరిస్తున్నట్లు ఢంకా బజాయించి చెప్పుకోకుండా—మౌనంగా ఆదర్శవంతమైన జీవితాన్ని సాగించేవారు కొందరుంటారు. మనం చెప్పే ఆదర్శాలు నిజ జీవితంలో అనుసరించడానికి కాదని 'జీవితం వేరు-ఆదర్శాలు వేరు' అని భావించేవారు మరికొందరుంటారు. అటువంటి 'ద్విపాత్ర' ధారుల ముసుగు తొలగి, నిజ స్వరూపం బయటపడినప్పుడు, చూసేవారికి ఎలా వుంటుంది?




కోనేరు కాబట్టి తలా బిందెడు నీళ్ళు తీసుకు పోతుంటారు. కోనేరుకెదురుగా దేవాలయం. దేవాలయానికి ఇరువైపులా బాట, బాటకి ఇరువైపులా చక్కటి ఇళ్ళున్నాయి. బాటలు ఇరువైపులా కలిసే చోటు దగ్గర పాఠశాల. దానికి కొంతదూరంలోనే పొలాలు. ఆ పక్కనే తోట ఉన్నాయి.

ఆ తోటంటే నా చిన్నతనం నుండీ యిష్టం. స్నేహితులతో ఎప్పుడూ అక్కడే ఆడుకొనేదాన్ని. నేనెప్పుడు వెళ్ళినా మౌనంగా ఆ తోట నన్నెప్పుడూ పలకరిస్తుంది. చెట్లన్నీ "బాగున్నావా!", అన్నట్లు తలలూగిస్తాయి. అదో గొప్ప అనుభూతి.

పాఠశాలకు ఎదురుగా కనిపించేదే తాతయ్య మేడ. ఊళ్ళో అందరూ రాజయ్య మేడ అని పిలుస్తారు. రాజయ్య తాత ఎప్పుడూ మౌనంగా గంభీరంగా వుంటాడు. అమ్మమ్మ చని పోయినప్పటినుంచీ ఆ మేడ కూడా ఆయన

గాంభీర్యాన్ని పుణికి పుచ్చుకుంది. ఆ పల్లెలో ఏ కొట్లాట వచ్చినా తాతయ్య ఇంటి ముందే ఊరి పెద్దలు అందరూ పరిష్కరించేవారు. తాతయ్యకు ప్రాణ స్నేహితుడు రామ్మూర్తి పంతులు. తాతయ్యంటే ఆ పల్లెలో అందరికీ అభిమానం, గౌరవం.

ఓ రోజు సాయంత్రం పొలాల్లో పనిచేసే వారు, పడమటి సూర్యుడు – గూటిలో చేరడానికి 'మీరు ముందా – నేను ముందా' అని పోటీపడి పోతున్నారు. కానీ "మీ అందరికన్నా నేనే యింటికి ముందు వెళతానోచ్" అని, నా స్నేహితులతో అనేసి, నేను మా తోట నుండి పరుగెత్తుకుంటూ యింటికి వచ్చాను. అక్కడ తాతయ్య, రామ్మూర్తి పంతులు, ఊరి ప్రెసిడెంటు, యింకా చాలమంది పెద్దలు గుమికూడి కూర్చొని ఉన్నారు. ఏదో పోట్లాటకు సంబంధించిన విషయంపై చర్చిస్తున్నారు. పరిగెత్తుకుంటూ వెళ్ళిందాన్ని గేటు దగ్గరే ఆగిపోయాను. తాతయ్య ముఖం చాల కోపంగా వుంది. మామూలుగా అయితే పరిగెత్తుకుంటూ వెళ్ళి తాతయ్య పక్కన కూర్చొనే దాన్ని. కానీ అప్పుడు తాతయ్య దగ్గరికి వెళ్ళటానికి భయం వేసింది.



రచయిత్రి కె. కుమారి - శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం (తిరుపతి)లో ఎమ్. ఎ. (తెలుగు సాహిత్యం) చదివారు. లలిత సంగీతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమగాయనిగా బహుమతులు పొందారు. 14వ యేట రంగస్థల ప్రవేశం చేసి 300 కు పైగా సాంఘిక, పౌరాణిక, జానపద నాటక ప్రదర్శనలలో పాల్గొన్నారు. 25 నాటక కళాపరిషత్ పోటీలలో పాల్గొని 16 సార్లు ఉత్తమ నటిగా బహుమతులు అందుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం (విశాఖపట్నం) నిర్వహిస్తున్న థియేటర్ ఆర్ట్స్ కోర్సులో 'డిప్లొమా ఇన్ ప్లే డైరెక్షన్' చేస్తున్నారు. ఉద్యోగం - విశాఖపట్నం ఆలిండియా రేడియోలో అనౌన్సర్‌గా. "నాటకం, సాహిత్యం, సంగీతం అంటే నాకు ప్రాణం. కళాకారిణిగా, రచయిత్రిగా ఉన్నతస్థాయికి ఎదగాలన్నది నా జీవిత ధ్యేయం" అంటారు కె. కుమారి.

తాతయ్య యింట్లో పనిచేసే తోటమ్మ ఏడుస్తోంది. తోటమ్మ మొగుడు చేతులు కట్టుకొని నిలబడి వున్నాడు. నేను ఒక వారగా నిలబడ్డాను. ఏదో ఆలోచిస్తూ తలెత్తిన తాతయ్య నన్ను చూశారు. గంభీరంగా ఉన్న ముఖంలో నన్ను చూసిన వెంటనే చిరునవ్వు మొలిచింది. "రామ్మా సహజా....రా...." అన్నారు. మెల్లగా వెళ్ళి తాతయ్య పక్కన కూర్చున్నాను. ఆ చిరునవ్వును గుబురు మీసాల చాటుకు తోసేసి దాచేశారు తాతయ్య. తాతయ్య అంత కోపంగా ఉండటం నేను ఎప్పుడూ చూడలేదు. అక్కడి వాళ్ళందరూ ఎందుకు ఆందోళనగా ఉన్నారో నాకేమి అర్థం కాలేదు. ఇంతలో తాతయ్య—

"ఏరా! తోటమ్మ చెప్పింది నిజమేనా? నీ తాగుడు కోసం దాన్ని కొట్టి, మంగళసూత్రం తెంపుకు వెళ్ళావా?" అడిగారు తోటమ్మ మొగుణ్ణి.

"లేదయ్యగారూ...." ఏదో చెప్పబోయాడు తోటమ్మ మొగుడు.

"ఛీ-నోర్ముయ్. యింకా అబద్దాలు కూడానా త్రాష్టుడా....అది ఏ పాపం చేసిందిరా దాన్ని అలా చంపుతున్నావు?" కణతలు అదురుతున్నాయి తాతయ్యకి కోపంలో.

"పీడ్ని యిలా కాదు. పోలీసులకు అప్ప జెప్పాలి. లేకుంటే బుద్ధి రాదు" అన్నాడు ప్రెసిడెంట్.

"అయ్యగారు వద్దండీ. అట్టా సేయమాకండి. ఆడు లేకపోతే నేను బతకలేనండీ" ఏడుస్తూ అంది తోటమ్మ.

"చూడరా! నువ్వు కొట్టి చంపినా నిన్ను ఎంతగా ప్రేమిస్తోందో" అన్నారు ఊరి పెద్దల్లో ఒకరు.

"ఎందుకు పేమించదండీ? నేనూ పేమిస్తాను. దాని పుట్టింటోళ్ళు యిత్తానన్న పైకం తెమ్మని సెప్పండీ. అంతవరకు అది నా పెళ్లాం కాదండీ" ఖచ్చితంగా అన్నాడు తోటమ్మ మొగుడు.

ఆ మాటతో తోటమ్మ ఏడ్చింది. తోటమ్మ ఏడుపు చూసి, నా కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి. తోటమ్మ మొగుడి మీద చాలా కోపం వచ్చింది. తాతయ్య ముఖం కందగడ్డలా తయారయ్యింది. దాంతో అక్కడే వున్న రామ్మూర్తి పంతులుగారు కలగచేసుకున్నారు.

"ఒరేయ్! దాని ముఖం చూసి ఆ మాట అనరా? అది కాయకష్టం చేసిన డబ్బంతా నీకే పెడ్తోంది. యింకా నీకు కట్నం పైకం యివ్వాలటరా? అది నిన్ను పోషిస్తుంది కాబట్టి నువ్వే యివ్వాలిరా దానికి కట్నం. నా మాట విని, దాన్ని యింటికి తీసుకెళ్ళు. ఇకమీదట దాన్ని కొట్టొద్దు. వెళ్ళు" అని ఎంతగానో నచ్చ చెప్పారు రామ్మూర్తి పంతులుగారు.

"అది నా పెళ్ళాం కాదన్న తర్వాత దాన్ని ఇంటికి తీసుకెళ్ళటం ఏటండీ?" అన్నాడు మొండిగా తోటమ్మ మొగుడు. ఎందరు ఎన్ని విధాలుగా చెప్పినా లాభం లేకపోయింది.

"అట్టాగేరా! అది నీ పెళ్ళాం కాదు. అంతే కదా వెళ్ళు. ఆ తాళి అక్కడ పెట్టెళ్ళు. నీ ముఖం ఈ చుట్టుప్రక్కల కనిపించకూడదు" అన్నారు కోపంగా తాతయ్య.

తోటమ్మ మొగుడు విసురుగా మంగళసూత్రాలు తాతయ్య ముందు పెట్టి వెళ్ళిపోయాడు.

"బాబుగారూ...." అంటూ తోటమ్మ కుప్ప కూలిపోయింది. ఊరిపెద్దలు, రామ్మూర్తి పంతులు తోటమ్మకు ధైర్యం చెప్పి కళ్ళద్దుకుంటూ వెళ్ళిపోయారు. మంగళసూత్రాలు తోటమ్మ చేతిలో పెట్టి బద్దలయ్యే అగ్నిపర్వతంలా తాతయ్య బాధను దిగమింగుతూ యింటి లోపలికి వెళ్ళిపోయారు. అందరూ వెళ్ళిపోయారు. తోటమ్మ మాత్రం హృదయ విదారకంగా ఏడుస్తూనే వుంది. ఇదంతా చూస్తున్న నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మరుసటి దినం తోటమ్మ ఎటు వెళ్ళిపోయిందో ఎవరికీ తెలియదు. ఆ తర్వాత ఆమె ఎవరికీ కనిపించలేదు!

*

"సహజా! సహజా! ఏంటమ్మా ఎందుకేడుస్తున్నావ్" అని అమ్మ ఆత్రుతగా అడుగుతూంటే ఏకధాటిగా వర్షిస్తున్న నా కళ్ళకు ఒకక్షణం ఏమీ అర్థం కాలేదు. తర్వాత తెలిసింది నేను తాతయ్య ఊళ్ళో లేనని, మా యింట్లో అరుగు మీద ఉన్నానని! అమ్మ ఆత్రుతగా చూస్తూ—

"ఎందుకే! అలా ఏడుస్తున్నావ్—ఏమైంది?" అని ఆప్యాయతతో కూడిన మందలింపుతో అడిగింది.

గబగబ కళ్ళు తుడిచేసుకుని నన్ను నేను సర్దుకొన్నాను. తోటమ్మ జ్ఞాపకాలు ఎందుకో నీడలా నాలో నిలచిపోయాయి. తర్వాత వచ్చీరాని నవ్వును నా ముఖంలో పులుముకుంటూ "అబ్బే....ఏం లేదే....?" అనేశాను.

"ఏమిటో ఈకాలపు పిల్లలు ఎందుకు ఏడుస్తారో, ఎందుకు నవ్వుతారో వాళ్ళకే తెలి

యదు'' అని "కాలేటికి టైమ్ అయ్యింది వెళ్ళవా?'' అంది అమ్మ.

"ఓ మైగాడ్! ఎనిమిదికి వెళితే తప్ప ఈ వైజాగ్‌లో బస్సులు అంది కాలేజీ చేరలేము'' అని నాలో నేను గొణుక్కుంటూ గబగబ రెడీ అయ్యి, పుస్తకాలు తీసుకొని కాలేజీకి వెళ్ళిపోయాను.

*

కాలేజీలో ఆ రోజు సాయంత్రం మీటింగ్ ఉందని చెప్పారు. మీటింగ్ హాలుకు వెళితే అక్కడ ఉపన్యాసకులుగా వచ్చింది — మా తాతయ్య ఊళ్ళో చూసిన రామ్మూర్తిపంతులుగారు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఓపక్క ఆనందం కూడా. ఆయనంటే ఒక విధమైన గౌరవం నాకు మా ఊళ్లో చూసినప్పటి నుంచీ. ఆయన ఎన్నో రచనలు కూడా చేశారు. నేటి సమాజంలోని అవకతవకల్ని ఎత్తి చూపేవి ఆయన రచనలు. స్త్రీల సమస్యల గురించి ఎన్నో కథలు రాశారు. ఆయన రచనలంటే చాలా అభిమానం నాకు. ఇంతలో మీటింగ్ ప్రారంభమైంది.

"సభాసదులకు నమస్కారం. ఈ రోజు నన్ను సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడమని పిలిచారు. బాగానే వుంది. నేడు సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలలో వరకట్నం చాలా భయంకరమైనది. ఎంతోమంది జీవితాలను బలి తీసుకుంటోంది.

"అసలు స్త్రీ జీవితం యొక్క అర్థం-పరమార్థం ఏవిటి? వేదకాలం నాడు స్త్రీని అర్ధాంగి అన్నారు. సభలలో, సమాజంలో సముచిత స్థానాన్ని ఇచ్చి స్త్రీయొక్క రాజకీయ, సామాజిక ప్రతిపత్తిని గుర్తించారు. ధర్మపత్ని లేకుండా పురుషుడు చేసే ఏ విధమైన ఐహిక కర్మలకు సార్థకత లేదన్నారు. ఆ కాలంలోనే యింత ప్రాధాన్యం యిచ్చారు స్త్రీలకు. నేడు అన్ని రంగాలలో పురుషుడితో సమానంగా ముందంజ వేస్తున్న స్త్రీ కట్నం ఎందుకు యివ్వాలి? చాలామంది పెద్ద మనుషులు దీనిని పెట్టుబడి లేని వ్యాపారంగా కొనసాగిస్తున్నారు. యువతీ, యువకులు కట్నం విషయంలో ఒక ఉద్యమంలా 'యివ్వము, తీసుకోము', అని నిర్ణయించుకోవాలి. ఇది యిలాగే కొనసాగిస్తే, చదువుకున్న మనలో ఏమాత్రం సంస్కారం లేదనే అనాలి....'' రామ్మూర్తి పంతులుగారు ఆవేశంగా చెబుతున్నారు.

నాకు ఈ సభ జరుగుతున్నంతసేపు తోటమ్మ నా మదిలో మెదిలింది. ఆయన మీద గొప్ప భావన నాలో నిలిచిపోయింది. ఆయన ఉపన్యాసం ఎంతో ఉన్నతంగా అనిపించింది. నేను ఆయన కూతురైనా, కోడలైనా అయితే ఎంత అదృష్టం అని అనుకొన్నాను.

అందరూ ప్రసంగం అయిపోయిన తర్వాత చప్పట్లు కొట్టడంతో ఈ లోకంలోకి వచ్చాను.

రామ్మూర్తి పంతులుగారి కోసం తల ఎత్తి చూశాను. కొంచెం దూరంలో విద్యార్థులకు ఆటోగ్రాఫ్ చేస్తూ కనిపించారు. వెళ్ళి "నమస్తే మేష్టారూ'' అన్నాను. ఆయన నన్ను గుర్తుపట్టనట్లుంది. తలపంకించి, సాలోచనగా కళ్ళద్దాలు సరి చేసుకుంటూ చూశారు.

"నేను మాస్టారూ! రాజయ్య మనుమరాలిని సహజని,'' అని గుర్తు చేశాను.

"నువ్వామ్మా సహజా! ఎంత పెద్దదానివి అయిపోయావు. గుర్తుపట్టలేకపోయాను తల్లీ. మీ తాతయ్య నన్ను మరిచిపోయినా నువ్వు మరిచిపోలేదన్నమాట'' కన్నుల్లో కాంతులు నిండగా అన్నారు.

"ఎలా మరిచిపోతాను మేష్టారూ .... నేను యిప్పుడు మీ అభిమానినైతేను'' అన్నాను.

"నేను వైజాగ్‌లోనే ఉంటున్నానమ్మా! రిటైర్ అయిపోయిన తర్వాత యిక్కడికి వచ్చేశాను. వీలైతే ఎప్పుడన్నా యింటికి రామ్మా, నిన్ను చూస్తూంటే మీ తాతయ్యని చూస్తున్నంత ఆనందంగా వుంది'' అని మరీ మరీ చెప్పి అడ్రసు యిచ్చి వెళ్ళిపోయారు మేష్టారు.

*

ఆ రోజు నా పుట్టిన రోజు. రామ్మూర్తిపంతులు గారి అడ్రసు తీసుకొని, స్వీట్స్ యివ్వాలని ఆయన యింటికి వెళ్ళాను. రామ్మూర్తి పంతులు గారు చాలా హడావిడిగా ఉన్నారు. ఇంట్లో అందరూ ఎక్కువ ఖరీదుగల టీవీ, టేప్‌రికార్డరు యింకా కొన్ని వస్తువులను ఒకచోట చేరుస్తున్నారు. ఎవరి ముఖంలో చూసినా ఆత్రుత, అదుర్దా స్పష్టంగా కనిపిస్తున్నాయి. మేష్టారును పలకరిద్దామంటే ఆయన నిలిచిన చోట నిలబడలేక యిల్లంతా బొంగరంలా గిరగిరా తిరిగేస్తున్నారు. 'పలకరిద్దామా? వెనుదిరిగిపోదామా?' అన్న సందిగ్ధావస్థలో వాకిట్లోనే నిలబడిపోయాను. ఎవరూ నన్ను గమనించలేదు, వాళ్ళ హడావిడిలో వాళ్ళు వున్నారు.

"ఏమేవ్! ఇదిగో ఆ సామాన్లన్నీ లిస్టు రాయి'' అన్నారు ఆయన.

"అలాగేనండి'' అంది పంతులుగారి భార్య.

"ఇంటి దస్తావేజులు కూడా తియ్యి. అవసరమైతే నీ నగలన్నీ కూడా ఆ సామాన్లతోపాటు అమ్మేద్దాము'' అంటున్నారు.

విషయం ఏవిటో నాకర్థం కాలేదు. మొత్తానికి మాష్టారు ఏదో కష్టాలలో ఉన్నారని అందుకే సామాన్లు, భార్య నగలు, ఇల్లు అమ్మేస్తున్నారని అనిపించింది. ఇక ఆందోళన భరించలేక లోపలికి వెళ్ళాను. నన్ను చూసిన వెంటనే ఎంతో ఆదరంగా "రామ్మా సహజా! రా....'' అని అంటూనే "ఒరే గోపీ, ఆ సామాన్లన్నీ జాగ్రత్తగా పేక్ చెయ్యి'' అని కొడుకును పురమాయిస్తున్నారు.

మాష్టారుకు వచ్చిన ఆపద ఏమిటో తెలుసుకోవాలని, నా బిడియాన్ని పక్కకునెట్టి కాస్త చొరవ తీసుకొని అడిగాను — "మాష్టారూ! ఎందుకు యింట్లో సామాన్లు, నగలు అమ్మేస్తున్నారు? అసలు ఏం కష్టం వచ్చింది?''

"కాదమ్మా సహజా! మా గోపీకి ఇంజనీరింగ్‌లో సీటు వచ్చిందమ్మా....దానికి డొనేషన్ కట్టాల్సి ఉంది. అందుకే ఈ ఇల్లు, యివన్నీ అమ్మేస్తున్నానమ్మా'' అన్నారు ఆయన.

"అదేమిటి మాష్టారూ! ఇంజనీరింగ్‌లో సీట్‌కి డొనేషన్ కట్టాలంటే మాటలా? లక్షలలో వుంటుంది. దానికని నిలువనీడ లేకుండా చేసుకుంటారా?''

"ఎన్ని లక్షలైనా ఫర్వాలేదమ్మా! నా తల తాకట్టుపెట్టి అయినా కడతాను'' దృఢంగా అన్నారు ఆయన.

కొడుకును చదివించాలనే తాపత్రయం చూసి ఆయన మీద జాలేసింది. నేను దిగులుగా ఆయన వంక చూశాను.

ఆయన నావైపు చూసి — "ఇందులో బాధపడాల్సింది ఏమీ లేదమ్మా....ఈ రోజు ఎన్ని లక్షలు ఖర్చుపెడితే, రేపు వాడి చదువు పూర్తయ్యి మా గోపి ఇంజనీర్ అయితే, ఏ ఆడపిల్లల తండ్రి అయినా దానికి రెండింతలు డబ్బు తెచ్చి వాడి కాళ్ళ దగ్గర పోస్తాడమ్మా.''

ఒక్కసారిగా షాక్ తిన్నట్లయ్యింది.

మాష్టారు వంక గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాను. నాకు నోటి నుంచి మాటలు రావడం లేదు. గొంతు తడారిపోయింది. చేతిలోని స్వీట్స్ ప్యాకెట్ ఎప్పుడు నేల జారిపోయిందో నాకు తెలియదు. ఎలాగోలా గొంతు పెగుల్చుకొని ఎన్నో ప్రశ్నలు ఆయన్ని అడగాలనిపిస్తోంది — "అంటే! ఆడపిల్ల జీవితానికి జీతం నిర్ణయిస్తారన్నమాట? తమ జీవితాలకు జీతం చెల్లించలేని తోటమ్మ లాంటి వారు, జీవితం నుంచి వెళ్ళిపోవాలన్నమాట....మరి కథలుగా రాసింది?....సభలలో మాట్లాడింది....?'' అని నిలదీయాలనిపించింది.

నా ముఖంలోని భావాలు చదివిన ఆయన — "పిచ్చి సహజా! అవన్నీ కథలలో రాయడానికి, సభలలో మాట్లాడడానికి మాత్రమే ఉపయోగపడతాయి తల్లీ....ఉపన్యాసవేదిక కాదమ్మా జీవితం అంటే, ఉపన్యాసం అయిన వెంటనే దిగిపోవడానికి. ఇది జీవితం'' అన్నారు చిరునవ్వుతో.

ఎవరో నా చెంప మీద చాచి కొట్టినట్లు ఒక అడుగు వెనక్కి వేశాను. □